'ఓడిపోతున్నా' అని తెలిసిన క్షణంలో కూడా పోరాడేవాడే నిజమైన ధైర్యవంతుడు..

Truth of News
PRGI Reg No: APTEL/26/A4782
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

శ్రీసత్యసాయి | సంపుటి: 02 | సంచిక : 11 | బుధవారం 19 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## అయోధ్య ట్రస్ట్‌కు తుది నివేదిక అందజేసిన సిట్

**- విచారణలో భాగంగా పలు కీలకాంశాలు**




**లక్నో - సూర్య వాస్తవం**

అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం వ్యవహారానికి సంబంధించి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఎస్ఐటీ) తుది నివేదికను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందజేసినట్టు ఉత్తర్ ప్రదేశ్ హోం శాఖ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయాన్ని సోమవారం అర్ధరాత్రి వేళ వెల్లడించింది. దీని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడానికి ట్రస్టుకు అవకాశం దక్కనుంది. ట్రస్ట్ అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం జూన్ 13న సిట్ ని ఏర్పాటు చేసింది. జూన్ 23న ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అందులో అనేక కఠినమైన సిఫారసులను చేసింది. లక్నో డివిజనల్ కమిషనర్ - మిగతా 2లో..



## ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4 వేల క్రిమినల్ కేసుల పెండింగ్

**- అమికస్ క్యూరీ నివేదిక వెల్లడి**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :**

దేశ వ్యాప్తంగా ఎంపిలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అమికస్ క్యూరీ సుప్రీంకోర్టుకు వెల్లడించారు. పదేళ్లకు పైగా 519 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 5 నుంచి10 ఏళ్ల మధ్య 754 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఎంపిలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల సత్వర విచారణపై అమికస్ క్యూరీ తాజాగా సుప్రీంకోర్టుకు 22వ నివేదికను సమర్పించారు.

ఈ నివేదికలోని వివరాల మేరకు. సిట్టింగ్ ఎంపిలపై 335 కేసులు పెండింగ్‌లో ఉండగా.. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై 1,222 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మాజీ ఎంపిలపై 269 కేసులు.. మాజీ ఎమ్మెల్యేలపై 1,339 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 700 కేసుల దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు. 360 కేసులు మూడేళ్లకు పైగా దర్యాప్తులో ఉన్నాయి. ఇక, లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సంస్థ నివేదిక వెల్లడించింది.

# పీఎం కేర్స్ ఫండ్ ఏం చేస్తున్నారు?

**- దాదాపు రూ.8,452 కోట్ల నిధులు జమ**

**- 2025లో కేవలం రూ.88 లక్షలే ఖర్చు..ఆడిట్‌లో పలు అంశాలు వెలుగులోకి**



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

కరోనా సమయంలో దేశంలోని పీఎం కేర్స్ ఫండ్ భారీ మొత్తంలో సేకరించారు. ఈ నిధిని చిన్నారులకు సహాయం, ప్రజారోగ్యం, ప్రకృతి వైపరీత్యాలు వంటి వాటికి ఖర్చు చేయాల్సి ఉంది. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ రకంగా ఖర్చు చేయటం లేదు. ఈ ఫండ్ కోట్లలో ఉండగా, ఖర్చు మాత్రం కేవలం లక్షల్లోనే ఉంది. పీఎం కేర్స్ ఫండ్ తాజా ఆడిట్ లోని రాబడి, చెల్లింపుల వివరాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.8,452.07 కోట్ల నిల్వలు ఉన్నాయి. ఇది అంతకు ముందు ఏడాది రూ. 7,173.03 కోట్ల నిల్వల కంటే ఎక్కువగా నమోదు అయింది.

అయితే 2025లో ఈ ఫండ్‌లో కేవలం రూ.87.85 లక్షలు మాత్రమే కేంద్రం ఖర్చు చేసింది. ఇది - మిగతా 2లో..



## సీజేపీ ఆందోళనపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీ

**- కమిటీ సిఫారసుల ఆధారంగా చర్యలు**

**- విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎఫ్ఐఆర్‌లపై నిర్ణయం**

**- ఏర్పాటుకు సుప్రీంకోర్టు నిర్ణయం**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

సీజేపీ తలపెట్టిన ' పార్లమెంట్ మార్చ్' సందర్భంగా విద్యార్థులపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలపై విచారణకు కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు మంగళవారం ప్రకటించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, రిటైర్డ్ డీజీపీతో కమిటీ ఏర్పాటు కానుంది. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఆదేశాలు బుధవారం వెలువడనున్నాయని - మిగతా 2లో..



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

**- అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్**

**- ఆమోదం కోసం గవర్నర్ వద్దకు చేరిన దస్త్రం**

**- సీనియారిటీకి, పార్టీ సేవకు గుర్తింపునిచ్చిన టీడీపీ అధిష్ఠానం**

**- గత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలు**

**అమరావతి- సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా బీసీలకు వెన్నుదన్ను

**- అసెంబ్లీలో చంద్రబాబు చారిత్రక ప్రకటన**

**- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ**

**- అసెంబ్లీ వేదికగా చారిత్రక నిర్ణయం ప్రకటించిన సీఎం చంద్రబాబు**

**- రాష్ట్రంలో 28 జిల్లా పరిషత్‌ల ఏర్పాటు, మేయర్లు, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు**

**- బీసీ రిజర్వేషన్లు తగ్గించి గత ప్రభుత్వం ద్రోహం చేసిందన్న ముఖ్యమంత్రి**

**- పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు అండగా ఉంటామని స్పష్టీకరణ**



**అమరావతి- సూర్య వాస్తవం**

"పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని సీఎం ప్రకటించ గానే సభ "జయహో బీసీ" నినాదాలతో దద్దరిల్లింది. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించుకుందని ఆయన అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతంరిజర్వేషన్లను బీసీలకు వర్తింపజేయనున్నట్టు ప్రకటించారు.

ఉమ్మడి రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం స్ఫూర్తితో, నిబంధనలకు లోబడే ఈ పెంపును అమలు చేస్తున్నామని వివరించారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని ఆయన సభకు గుర్తుచేశారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను - మిగతా 2లో..

## అక్రమ సంపాదనతో తప్పుడు ప్రచారం

**- కర్నాటక, తమిళనాడులో చేతబడి పూజలు**

**- కరువు రావాలని, రైతులు నష్టపోవాలని కోరుతున్నారు**

**- చెట్లకు కట్టేసి కొట్టాలి**

**- బడుగు, బలహీనవర్గాలను గొర్రెలు, బర్రెలు పెంచుకోమన్నారు**

**- సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం : విగ్రహావిష్కరణలో సీఎం ఏ రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

పదేండ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్లు తమ దగ్గర ఉన్న అక్రమ సంపాదనతో మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. వారి ప్రచారాన్ని ప్రజలు నమ్మట్లేదని తెలిసి, రాష్ట్రంలో కరువు రావాలని, రైతులు నష్టపోవాలని అఘోరా రావు చేతబడి పూజలు చేయించి వచ్చాడని విమర్శించారు. అధికారం కోసం ఇంతకు దిగజారుతారా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో చేతబడి చేసేవాళ్లను చెట్లకు కట్టేసి కొడతారని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని - మిగతా 2లో..

## అక్రమ సంపాదనతో
# తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

బడుగు, బలహీన వర్గాల యువతను బర్రెలు, గొర్రెలు పెంచుకోవాలనీ, చెప్పులు కుడుతూ, చేపలు పట్టుకోండని చెప్పిందని గుర్తుచేశారు. కానీ తాము ఆ వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదవాలని కాంక్షిస్తున్నామనీ, రాష్ట్రాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తున్నామని వివరించారు. మంగళవారంనాడిక్కడి ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ఇందిరమ్మ పాలనలో బహుజనుల తెలంగాణ.

సామాజిక న్యాయం, జీవించడానికి స్వేచ్ఛ ఉందని నిరూపించామన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని చూసి, ప్రజలు పోరాట స్ఫూర్తి పొందాలన్నారు. ఆయన బహుజనులతో కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశారని చరిత్రను గుర్తుచేశారు. మహారాష్ట్రలో శివాజీ విగ్రహానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో, తెలంగాణలో బహుజనులు కూడా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అంతే ప్రాధాన్యత ఇస్తారనీ, బ్రిటిష్ లైబ్రరీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విశేషాలు ఉన్నాయనీ, అక్కడి నుంచే మనం ఆయన చరిత్రను తెలుసుకున్నామని వివరించారు. తెలంగాణ అమరవీరుల స్థూపం స్థాయిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పాలమూరు జిల్లాలో పండుగ సాయన్న పోరాటం, పౌరుషం అందరికీ తెలుసునని. అక్టోబర్ 22న ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పారు. 2029 ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ నేతృత్వంలోనే మళ్లీ అధికా రంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుం దనీ, గ్రామాల్లో అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ పింఛన్లు వచ్చేలా యువకులు సహకారాన్ని అం దించాలని కోరారు. ప్రభుత్వ పొలాలు, కాల్వ గట్లు, నీటిపా రుదల ప్రాజెక్టుల వద్ద ఈత, తాటి చెట్లు నాటేలా చూస్తామనీ, కులవృత్తులు చేసుకుంటూనే, తమ పిల్లల్ని బాగా చదివించి, వైద్యులు, న్యాయవాదులు, ఐఏఎస్‌లుగా మార్చి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాముల్ని చేయాలని కోరారు.

పిల్లల తలరాతలను విద్యమాత్రమే మార్చగలుగుతుందన్నారు. ఉన్నతమైన విద్య, ఆకలి లేని చదువును అందించే బాధ్యత తనదేనని చెప్పారు. గౌడ కులస్తుల సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇప్పటి వరకు వారికి యాభై వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశామనీ, ప్రమాదవశాత్తు చనిపోతే ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. రెండోసారి 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య పరిపాలనలో ఉన్న వ్యత్యాసాన్ని సభికులకు వివరిం చారు. గత పాలకులది కుటుంబ న్యాయం అనీ, తమది సామాజిక న్యాయం అని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ ప్రభుత్వం అందరిదీ అనీ, ఎలాంటి లోటుపాట్లుఉన్నా మాట్లాడుకుని ముందుకు వెళ్దామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఎంపీలు పాల్గొన్నారు.

## పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా
# బీసీలకు వెన్నుదన్ను

(మొదటిపేజీ తరువాయి)

శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని చంద్రబాబు పునరుద్ఘాటించారు. 1984లో ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'యాక్ట్ ఆఫ్ 5' కింద దాన్ని 34 శాతానికి పెంచామని తెలిపారు. తమ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేయడం వల్లే ఎర్రన్నాయుడు, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, దేవేందర్ గౌడ్, అయ్యన్నపాత్రుడు వంటి లెజెండరీ నాయకులు బీసీ వర్గాల నుంచి ఎదిగారని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రోత్సాహం అందిస్తే ఎంపీటీసీ స్థాయి నేత కూడా ఎంపీగా ఎదగొచ్చని, కర్నూలు జిల్లాకు చెందిన బస్తిపాటి నాగరాజును ఎంపీగా గెలిపించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్లతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలను కూడా సీఎం ప్రకటించారు. సుస్థిర పాలన కోసం పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికను మళ్లీ ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రస్తుతం 13గా ఉన్న జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 28కి పెంచుతున్నట్లు తెలిపారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు పొందాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యవసరమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు, గ్రామీణ వృత్తులకు బీసీలే వెన్నెముక అని సీఎం కొనియాడారు. వారి నైపుణ్యానికి సాంకేతికతను జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్య అందిస్తామని, విద్య, ఉపాధి, నైపుణ్యం ద్వారా వారిని ఉన్నత స్థానంలో నిలబెడతామని హామీ ఇచ్చారు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, అవకాశం రాక వెనుకబడినవారని, వారికి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ చారిత్రక ప్రకటన అనంతరం బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా
# వర్ల రామయ్య, దళవాయి రమ

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

## పీఎం కేర్స్ ఫండ్
# ఏం చేస్తున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

2023-24లోని రూ.15.60 కోట్ల నుంచి గణనీయంగా తగ్గింది. 2025లో రూ.87.84 లక్షలు చిల్డ్రన్ స్కీమ్‌కు కేటాయించగా, రూ.451 బ్యాంకు, ఎస్ఎంఎస్ ఛార్జీలకు ఖర్చు చేశారు. 2025 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన ఖాతాలపై 2026 ఆగస్టు 6న ఫండ్ సంబంధిత అధికారులు, ఆగస్టు 7న చార్టర్డ్ అకౌంటెంట్ సంతకాలు చేశారు.

రూ.8,452.95 కోట్లలో రూ.7,846.65 కోట్లు షెడ్యూల్డ్ బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, మరో రూ.604.41 కోట్లు బ్యాంకు పొదుపు ఖాతాల్లో ఉన్నాయి. దేశీయ విరాళాల రూపంలో 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.479.05 కోట్లు అందగా, అంతకు ముందు ఏడాది ఇది రూ. 681.81 కోట్లు అందింది. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.1.14 కోట్లుగా ఉన్న విదేశీ విరాళాలు, 2025లో రూ.92.83 లక్షలు నమోదు అయ్యాయి.

వడ్డీ మరో ప్రధాన ఆదాయ వనరుగా నిలిచింది. ఈ ఏడాదిలో ఈ పథకం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రూపంలో రూ.469.38 కోట్లు, సేవింగ్స్ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.5.77 కోట్లు ఆర్జించింది. ఇది అమలు చేసే ఏజెన్సీల నుంచి రీఫండ్‌ల రూపంలో రూ.324.66 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీపై మినహాయించిన పన్ను రీఫండ్‌గా రూ.13.49 లక్షలు పొందింది. కరోనా సమయంలో పీఎం కేర్స్ ఫండ్ 2020 మార్చిలో ఏర్పాటు చేశారు. అదే ఏడాది మార్చి 27న న్యూఢిల్లీలో ట్రస్ట్ డీడ్ రిజిస్టర్ చేశారు. ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు లేదా మానవ నిర్మిత విపత్తులు, ఇతర క్లిష్ట పరిస్థితుల్లో సహాయం అందించడానికి ఈ నిధిని ఒక ప్రత్యేక యంత్రాంగంగా రూపొందించారు. దీని లక్ష్యాలు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు, ఔషధ సౌకర్యాలు, పరిశోధన, ప్రభావిత ప్రజలకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం కోసం నిధులను కూడా అందించాలి. దీనికి పదవీ రీత్యా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చైర్మన్‌గా, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు.

వీరే కాకుండా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కెటి థామస్, కేంద్ర మాజీ మంత్రి కరియా ముండా నామినేటెడ్ ట్రస్టీలుగా ఉన్నారు. ట్రస్ట్ సహాల మండలిలో మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రాజీవ్ మెహ్రిషి, సుధామూర్తి, ఆనంద్ షా ఉన్నారు.

# అయోధ్య ట్రస్ట్‌కు తుది నివేదిక అందజేసిన సిట్

(మొదటిపేజీ తరువాయి)

విజయ్ విశ్వాస్ పంత్ అధ్యక్షతన ఏర్పడిన ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఐజీ రేంజ్ కిరణ్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి నీల్ రతన్ కుమార్ సభ్యులుగా ఉన్నారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా జూన్ 25న శ్రీరామ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో మొదటి ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో ఎనిమిది మంది వ్యక్తుల పేర్లతో పాటు ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా చేర్చారు. వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అవినీతి నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

**సిట్ దర్యాప్తులో కీలక విషయాలు**

ఇదిలా ఉండగా, అంతకుముందు జరిగిన సిట్ దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లెక్కింపు సమయంలో పర్యవేక్షణ లోపాలను సిట్ గుర్తించింది. అనంతరం పలు అరెస్టులు కూడా చేసింది. రామాలయ విరాళాల కౌంటింగ్ కేంద్రాల నుంచి రూ.500 నోట్లతో మొదలైన ఈ చేతివాటం, తర్వాత కట్టలకొద్దీ తస్కరించే వరకూ వెళ్లిందని సిట్ గుర్తించింది. వాటి మొత్తం రూ. 2-3 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేసింది. అంతేకాదు, సీసీటీవీ నిఘా, భద్రతా నిబంధనల్లోని లోపాలను నిందితులు తమకు అనుకూలంగా మార్చుకున్నారని గతంలో పేర్కొంది. తొలుత కరెన్సీ నోట్లను జేబులో వేసుకున్నారని దర్యాప్తు అధికారులు గుర్తించారు. తమ దుస్తుల్లో ఆ నోట్లను దాచుకొని, బయటకు తీసుకెళ్లినట్టు నిందితులు అంగీకరించారు. అయితే, ఆ దొంగతనాలను ఎవరూ గుర్తించకపోవడంతో క్రమంగా ఆ నోట్ల సంఖ్య పెరిగింది. కాగా, ఈ కేసులు ఇప్పటికే రామ జన్మభూమి ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. ఆలయ నిర్వహణ కోసం కొత్త సీఈఓ నియామక ప్రక్రియ నడుస్తోంది.

**సుప్రీం కోర్టు ఏమంది?**

అయోధ్య విరాళాల చోరీ వ్యవహారానికి సంబంధించి గతంలో సుప్రీం కోర్టు కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయొద్దని, అలాగే, కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని వ్యాఖ్యానించింది. ఇది కేవలం ఓ నేరానికి సంబంధించిన అంశం మాత్రమేనని, సరైన దర్యాప్తు జరిగేలా చూస్తామని పేర్కొంది. విరాళాల చోరీపై దర్యాప్తునకు నియమించిన నలుగురు సభ్యుల సిట్ బృందంలో ఐదో సభ్యుడిగా ఫోరెన్సిక్ ఆడిటర్‌నూ చేర్చాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. దర్యాప్తు పారదర్శంగా జరగాలని, ఆలయంలో అక్రమాలకు చోటివ్వని విధంగా తగిన చర్యలూ తీసుకోవాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యాబాగ్చీ, జస్టిస్ వి.మోహన ధర్మాసనం సూచించింది.

కాగా, రామమందిర కానుకల చోరీ వ్యవహారం ఘటన దేశవ్యాప్తంగా పెద్ద రాజకీయ చర్చకు దారితీసింది. రాష్ట్ర స్థాయి నుంచి కేంద్ర స్థాయి వరకు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు గుప్పిస్తునే ఉన్నాయి. అయితే తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్ప్రదేశ్ ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది.

# సీజేపీ ఆందోళనపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం ప్రకటించింది. పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటు చేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజీ, సీసీ టీవీ రికార్డింగ్స్‌ను కమిటీకి అందజేయాల్సిందిగా ఆదేశాలు ఇస్తామని పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఢిల్లీతో పాటు ఇతర ప్రాంతాల్లో మహిళా నిరసనకారులే లక్ష్యంగా దాడులు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలు, నమోదైన ఫిర్యాదులను కూడా ఈ ఉన్నత స్థాయి కమిటీ పరిశీలిస్తుందని ధర్మాసనం తెలిపింది. బాధితులందరి వాదనలను కమిటీ వింటుందని, కమిటీ సిఫారసుల ఆధారంగానే చర్యలు తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాక విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది.

నేర చరిత్ర లేని విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసే అంశాన్నీ పరిశీలిస్తామని తెలిపింది. ఆర్టికల్ 19 కింద నిరసనలు తెలిపే అధికారం విద్యార్థులకు ఉందని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎఫ్ఐఆర్‌లపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**పార్లమెంట్ మార్చ్ చట్టవ్యతిరేకమా?**

జులై 20న సీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా అక్కడి విద్యార్థులు, నిరసనకారులపై పోలీసులు, కేంద్ర బలగాలు లాఠీచార్జీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో టియర్ గ్యాస్, పెల్లెట్స్ ప్రయోగం కూడా జరిగింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనికి ఢిల్లీ పోలీసులు బదులిస్తూ అఫిడవిట్ దాఖలు చేశారు. సీజేపీ ఆందోళనకు అనుమతి లేదని, అది చట్టవ్యతిరేకమని తెలిపారు. అలాగే, అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారినందువల్లే బలప్రయోగం చేయాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ అఫిడవిట్‌లో పోలీసులు పేర్కొన్న వివరాల ప్రకారం.. 'సీజేపీ నిర్వహించిన పార్లమెంట్ మార్చ్‌కు జంతర్ మంతర్ వద్దకు 30,000 మంది వరకు వచ్చారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర వారంతా నిలిచి ఉన్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు 5,000 మంది పోలీసులు, భద్రతా సిబ్బంది ఉన్నారు. మొదట ఈ ర్యాలీ శాంతియుతంగా జరిగింది. ఆ తరువాత కొందరు ఆందోళనకారులు బారికేడ్లు దాటుకుంటూ పార్లమెంట్ వైపు దూసుకొచ్చారు. దీంతో ఆందోళనకారులకు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణ తలెత్తింది.

ఈ క్రమంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో వారిని అదుపు చేసేందుకే బలప్రయోగం చేయాల్సి వచ్చింది. ఈ ఘర్షణల్లో 240 మంది పోలీసులు, భద్రతా సిబ్బంది గాయపడ్డారు. 200 మంది ఆందోళనకారులకూ గాయాలయ్యాయి. ఆందోళనకారులు మరింత ముందుకు రాకుండా ఉండేందుకు, శాంతి భద్రతల్ని కాపాడేందుకే లాఠీచార్జీ చేయాల్సి వచ్చింది. ఆందోళనలో పాల్గొన్న వారిలో కొందరిపై క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయి. 2,873 మందిపై హత్యాయత్నం, దోపిడీ, పోక్సో సహా పలు క్రిమినల్ కేసులున్నాయి. వీటిని సిట్ విచారిస్తోంది. ఆందోళనకారుల్ని అదుపు చేసేందుకు మేకులు కలిగిన లాఠీలను వాడలేదు.

ఈ నిరసన సమయంలో కొందరు పోలీసులపై దాడికి పాల్పడ్డారు. వారిపై దాడి జరిగింది అంటూ వైరల్ అయిన కంటెంట్‌లో పూర్తి వివరాలు లేవని, వాటిలో స్పష్టత లేదని పోలీసులు తెలిపారు. ఆందోళనలో పాల్గొన్న వారిని గుర్తించేందుకు ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ వాడినట్టు' పోలీసులు తెలిపారు. అయితే ఈ అఫిడవిట్‌పై సుప్రీంకోర్టు విచారించాల్సి ఉంది. అలాగే విద్యార్థుల తరపున పిటిషన్ దాఖలు చేసిన సీనియర్ న్యాయవాదులు కూడా వాదనలు వినిపించనున్నారు.

# రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

## - ఎస్ఐ సుభాష్ చంద్రబోస్



**చెన్నూరు-సూర్య వాస్తవం:**

రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై చెన్నూరు పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు చెన్నూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వాహనదారులకు రహదారి భద్రతా జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలను నడిపేటప్పుడు వేగ నియంత్రణ పాటించా లని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు తెలిపారు.ముఖ్యంగా వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. రహదారిపై ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించ కుండా ప్రయాణించాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## లోకల్ బాడీ ఎన్నికల ఫీవర్



**విజయవాడ - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ లో మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలను ఏ విధానంలో నిర్వహించాలనే అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈవీఎంల కంటే బ్యాలెట్ పేపర్ విధానానికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.స్థానిక ఎన్నికలకు అవసరమైన స్థాయిలో ఈవీఎంలు అందుబాటులో లేకపోవడం బ్యాలెట్ వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. బ్యాలెట్ విధానంలో ఓటరు అభ్యర్థుల గుర్తులు, పేర్లను చూసి తనకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాల్సి ఉంటుంది. అందువల్ల అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, గ్రామంలో చేసిన పని, స్థానిక సమస్యలపై అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఓటింగ్ విధానం ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. ప్రజల అభిప్రాయం, అభ్యర్థుల బలం, పార్టీ సంస్థాగత సామర్థ్యం, స్థానిక సమస్యలు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి, తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమికి మధ్య పోటీపై ఆసక్తి నెలకొంది. బ్యాలెట్ విధానం తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నట్లు రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. అయితే గ్రామస్థాయిలో ఓటర్లు తమ ప్రాంతానికి ఎవరు మెరుగైన సేవలు అందించగలరనే విషయాన్ని ప్రధానంగా పరిశీలించే అవకాశం ఉంది.కూటమి విషయానికి వస్తే సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి పెడుతోందనే ప్రచారం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా స్థానిక రాజకీయాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య కూటమి సమన్వయం కూడా ఎన్నికల సమయంలో కీలకంగా మారవచ్చు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశు ద్ధ్యం, సాగునీరు, విద్య, ఉపాధి వంటి స్థానిక అవసరాలపై ప్రజల దృష్టి ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన పనులు తమ ప్రాంతానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయో ఓటర్లు అంచనా వేసే అవకాశం ఉంది. అదే సమయంలో స్థానిక అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల బ్యాలెట్ విధానం అమలైతే ఒక పార్టీకి స్వయంచాలకంగా ప్రయోజనం కలుగుతుందని చెప్పడం కష్టం. ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది చివరకు ప్రజల తీర్పే. గ్రామస్థాయిలో తమకు దగ్గరగా ఉన్న సమస్యలను ఎవరు పరిష్కరిస్తారనే అంశమే ఓటర్ల నిర్ణయంపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో రాబోయే స్థానిక ఎన్నికలలో ఏ పార్టీ గెలుస్తుంది అన్న విషయం పై సర్వత్ర ఉత్కంఠత నెలకొంది..

## రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్టా?

**హైదరాబాద్ - సూర్య వాస్తవం :** తెలంగాణ రాజకీయాలు రోజురోజుకూ సరికొత్త వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. అభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై జరగాల్సిన రాజకీయ చర్చ.. క్షుద్రపూజలు, అఘోరా యాగాల స్థాయికి దిగజారడం రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ములుగు జిల్లా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తూ చేసిన అఘోరా పూజల వ్యాఖ్యలు, దానికి మాజీ మంత్రి హరీష్ రావు ఇచ్చిన ఘాటు కౌంటర్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి.ములుగులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా ప్రతిపక్ష బీఆర్ఎస్ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక కీలక 'మేనల్లుడు' పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులకు వెళ్లి అఘోరా పూజలు, క్షుద్ర తంత్రాలు చేయించారని ఆరోపించారు. తెలంగాణలో వర్షాలు కురవకూడదని, కరవు తాండవించాలని, తద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలని కోరుకుంటూ ఈ క్షుద్ర క్రియలకు పాల్పడ్డారని సీఎం విమర్శించారు. "ప్రజలు చనిపోయినా పర్వాలేదు.. ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలన్నదే వారి కుట్ర. ఎన్ని క్షుద్రపూజలు చేసినా భగవంతుడు ప్రజాపక్షాన నిలబడ్డాడు కాబట్టే వర్షాలు సమృద్ధిగా కురిసి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిండింది" అంటూ రేవంత్ రెడ్డి తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తారు.సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ ఆరోపణలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తక్షణమే స్పందించారు. ఈ వ్యాఖ్యలను పూర్తిగా నిరాధారమైనవిగా, రాజకీయ దిగజారుడుతనంగా కొట్టిపారేశారు. పాలనా వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి చౌకబారు ప్రచారాలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. "ఇలాంటి వ్యక్తిగత దాడులకు, చిల్లర రాజకీయాలకు నేను భయపడను. రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాను" అని స్పష్టం చేశారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, కోర్టుల ద్వారా న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఇప్పటికే తనపై ఇలాంటి ఆరోపణలు చేసినందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డిలకు లీగల్ నోటీసులు పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.సాగుతున్న ఈ ఘర్షణ కేవలం రెండు పార్టీల ఆరోపణలకే పరిమితం కాలేదు. దీని వెనుక వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర క్షేమాన్ని కోరుకోవడం లేదని, అధికారం కోసం రాష్ట్ర ప్రజలకు హాని తలపెట్టే స్థాయికి వెళ్లారనే భావనను ప్రజల్లో బలంగా నాటడం అధికార కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఎన్నికల హామీలు, రుణమాఫీ, ఇతర పరిపాలనాపరమైన సమస్యలను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోలేకనే 'చేతబడి', 'క్షుద్రపూజలు' వంటి పాతకాలపు సెంటిమెంట్లను తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడి చేస్తోంది. కాంగ్రెస్ నేతలు రాజకీయ సభల్లో పర్సెప్షన్ వార్ సాగిస్తుంటే, హరీష్ రావు లీగల్ నోటీసుల ద్వారా కాంగ్రెస్ నేతలను న్యాయపరంగా ఇరుకున పెట్టాలని చూస్తున్నారు.రాష్ట్రంలో ప్రజా సమస్యలు, తాగునీరు, విద్య, ఉద్యోగాల కల్పనపై నిర్మాణాత్మక చర్చ జరగాల్సిన తరుణంలో, ప్రధాన పార్టీల మధ్య క్షుద్రపూజల చుట్టూ రాజకీయాలు నడవడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం ఆరోగ్యకరం కాదు. ఒకరిపై ఒకరు నైతికతను కోల్పోయి చేసుకుంటున్న ఈ వ్యక్తిగత ఆరోపణలు ప్రజాక్షేత్రంలో ఏ మేరకు ప్రభావం చూపుతాయో, ప్రజలు ఎవరి వాదనను విశ్వసిస్తారో వేచి చూడాల్సిందే

## ప్రజల భద్రతే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా
# విస్తృత అవగాహన కార్యక్రమాలు

- -జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు.
- మహిళలు, బాలల రక్షణ,బాల్య వివాహాలపై ప్రత్యేక అవగాహన.
- సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలకు అప్రమత్తత.
- రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన.
- గంజాయి, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన.
- అత్యవసర సమయాల్లో డయల్--112 సేవలను వినియోగించుకోవాలని సూచన.
- ప్రజలతో నేరుగా మమేకమై స్థానిక సమస్యలపై ఆరా.
- ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం కోరిన పోలీసులు



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు ప్రజలతో నేరుగా మమేకమై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. గ్రామాలు,కాలనీలు,పట్టణ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు,ప్రజల భద్రత,నేరాల నియంత్రణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.చిట్టమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లం గ్రామంలో మహిళలపై జరిగే నేరాలు,రోడ్డు భద్రత,సైబర్ నేరాలు,గంజాయి మరియు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.శ్రీహరికోట పోలీస్ స్టేషన్ పరిధిలోని శబరి కాలనీలో స్థానిక ప్రజలతో పోలీసులు మమేకమై మహిళలపై నేరాలు,బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు,స్థానిక సమస్యలు,రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్--112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెలవేడు గ్రామంలో స్థానిక ప్రజలతో సమావేశమై రోడ్డు భద్రత,సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణాన్ని కొనసాగిస్తూ,ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు.

నాయుడుపేట పట్టణంలోని వార్డు నెం. 25, ఇందిరాగాంధీ కాలనీలో పోలీసులు ప్రజలతో మమేకమై ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.అలాగే సైబర్ నేరాలు,మాదకద్రవ్యాల నివారణ,మహిళలపై జరిగే నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కోడూరు రూరల్ సర్కిల్ పరిధిలోని పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేట గ్రామంలో సీఐ గ్రామాన్ని సందర్శించి గ్రామ పెద్దలు,స్థానిక ప్రజలతో మమేకమయ్యారు.గ్రామంలోని స్థానిక పరిస్థితులు, ప్రజల సమస్యలను తెలుసుకుని,శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజల భద్రత,నేరాల నియంత్రణ,మహిళలు మరియు బాలల రక్షణ,సైబర్ నేరాల నివారణకు పోలీసు శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది.ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు,ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉన్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్--112కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

"జిల్లా ఎస్పీ సందేశం"ప్రజల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని,ప్రజలు ఎటువంటి భయం లేకుండా పోలీసులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్,సూచించారు.ప్రజల సహకారంతోనే సురక్షితమైన, ప్రశాంతమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశం అనంతరం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి కాళంగి బ్రిడ్జి,కొరిడి-పెర్నాడు రోడ్డు,వేనాడు రోడ్డు తదితర కీలక అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ చర్చించారు.ఈ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి త్వరగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కోరారు.

## బీసీలకు అండగా కూటమి ప్రభుత్వం

**- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్**
**- కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి**



**డోన్ -సూర్య వాస్తవం**

బీసీ రిజర్వేషన్ల పెంపు పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 34%శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలపడం పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు అండగా ఉంటామని మరోసారి మా ప్రభుత్వం రుజువు చేసిందని అన్నారు. వైసీపీ హయాంలో బీసీలు రాజకీయంగా ఎదగకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అణచివేతకు గురిచేశారని అన్నారు బీసీలకు రాజకీయ సామాజిక, ఆర్థిక రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని. స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు బీసీల రాజకీయ సాధికారత కోసం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించారని.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, వారి అభ్యున్నతికి అనేక అవకాశాలు కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. బీసీలకు అండగా వారి అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. రాజ్యాంగ పరిమితులు పాటిస్తూనే సామాజిక న్యాయం కూటమి ప్రభుత్వం చేస్తుందని సమాజంలో ప్రతి వర్గానికి అవకాశం కల్పించాలని మా కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు.

## కోట్ల కుటుంబం ఎల్లవేళలా పేదలకు అండగా ఉంటాం

**- డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ**



**డోన్ -సూర్య వాస్తవం**

డోన్ పట్టణం లో నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన దొరపల్లి ఉడుములపాడు లేఔట్ కాలనీలకు అవసరం అయిన మౌలిక సదుపాయలు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సహకారంతో కల్పిస్తానని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రకటించారు. మంగళవారం ఉడుములపాడు దొరపల్లి లేఔట్ కాలనీ లో పర్యటించిన ఆమె రోడ్లకు అడ్డముగా పెరిగిన ముళ్లకంపాలను చూసి ఆశ్చర్యపోయారు.కంప చెట్లతో కూరుకుపోయిన ఇంటి నిర్మాణాలు మధ్య పేదలు ఏ విధంగా నివాసాలు ఏర్పరచుకుంటారని ఆమె ఆవేదన చెందారు. పేదల కాలనీలను స్వయంగా పరిశీలించి అక్కడి పరిస్థితిని చూసి చలించి పోయిన సుజాతమ్మ అప్పటికప్పుడే స్పందించారు. ఈ సందర్భంగా సుజాతమ్మ మాట్లాడుతూ గత పాలకులు తమ సొంత లాభల కొరకు పేదలకు కొండగుట్టలో నివాసయోగ్యం కాని స్థలాలను మంజూరు చేసి ప్రజలను నిర్మాణాలు చేసుకోకపోతే ఇచ్చిన స్థలాలు రద్దు చేస్తాం అని బయపెట్టి ప్రజలను అప్పుల్లో నెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి చేసామని చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు పేద ప్రజలు నివసించడానికి కాలనిలలో ట్యాంక్ లు నిర్మించి కనీసం నీటి వసతి కల్పించలేక పోయారని ఆమె విమర్శించారు.తాము త్వరలో కాలనీ లకు నీటి సదుపాయం కల్పించి ప్రజలు కాలనీలలో నివాసం ఉండడానికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు . ఈ కాలనీలను గతంలో తాను ఏర్పాటు చేసిన వైస్.ఎస్ నగర్ కోట్ల విజయ భాస్కరరెడ్డి నగర్ ,కోట్ల సుజాతమ్మ నగర్,ఆటో నగర్ తదితర కాలనీలు మాదిరిగా తీర్చిదిద్దుతానని సుజాతమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి...!

**- ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన పార్టీ అధినాయకత్వానికి దలవాయి రమాదేవి కృతజ్ఞతలు...**

**- దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి దక్కడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం...!**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అసెంబ్లీ ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన దలవాయి రమాదేవి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు దలవాయి రమాదేవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన పార్టీ అధినాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతపురం నియోజకవర్గంలోని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ కూడా పాల్గొన్నారు.

## ఇసుకాసురుల ఆట కట్టు...!

**- అక్రమంగా డంప్ చేసిన 300 టన్నుల ఇసుక సీజ్...!**

**- అక్రమ ఇసుక దందాపై అనంతపురం జిల్లా పోలీసుల ఉక్కుపాదం...**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** శింగనమల రూరల్ ఉల్లికల్లు ఇసుక కాలువ వద్ద గుట్టుచప్పుడు కాకుండా నిల్వ ఉంచిన సుమారు 300 టన్నుల అక్రమ ఇసుక డంపులను అధికారులు సీజ్ చేశారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు శింగనమల పోలీసులు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమ ఇసుక దందాకు సంబంధించి ఐదుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అలాగే తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమ ఇసుక నిల్వలపై కఠిన చర్యలు ఇసుకను అక్రమంగా తవ్వినా, నిల్వ చేసినా, రవాణా చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని శింగనమల సీఐ రాగిరి రామయ్య హెచ్చరించారు. అక్రమ ఇసుక దందాకు పాల్పడే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజా వనరులను పరిరక్షించడమే లక్ష్యంగా అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై నిరంతరం చర్యలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## నీలూరులో ఇంటింటికి జోరుగా టీడీపీ నాయకుల ప్రచారం



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండలం నీలూరు గ్రామంలో మంగళవారం టిడిపి నాయకులు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనలో నిర్వహించిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గూర్చి ఇంటింటికి వెళ్లి వివరిస్తూ ప్రభుత్వం నుంచి తల్లి దీవన, రైతు భరోసా నేతన్న నేస్తం బియ్యం చెక్కర లాంటి లాంటి సంక్షేమాలన్నీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరిన్ని సేవలు సంక్షేమాలు ప్రభుత్వం నుంచి అందాలంటే కూటమి ప్రభుత్వానికి చేదోడుగా నిలవాలని త్వరలో రానున్న స్థానిక ఎన్నికలలో అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోబూత్ కన్వీనర్ రామాంజినేయులు స్టోర్ డీలర్ రంజిత్ టీడీపీ నాయకులు సంజీవ రెడ్డి నారాయణ రెడ్డి రాజు కుళ్లాయప్ప గంగవర్దన గణేష్ అబ్దుల్ భాష బోయ మహేష్ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డంతా గుంతలమయం..

**- గ్రామస్తులకు తప్పని అవస్థలు..!**

**- బాలయ్య ఒక్కసారి ఇటు చూడయ్యా..!**

**- దేమకేతేపల్లి రోడ్డు దుస్థితిపై గ్రామస్తుల ఆవేదన...**

**- కొర్లకుంట, గొల్లపల్లి, ఓబులాపురం ప్రజలకు నిత్యం ఇబ్బందులు..**

**- వృద్ధులు, గర్భిణులు, అత్యవసర రోగులకు తప్పని రహదారి కష్టాలు...**

**హిందూపురం రూరల్ - సూర్య వాస్తవం :** సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి మీదుగా కొడికొండ--మడకశిర హైవేకు అనుసంధానంగా ఉన్న రహదారి అధ్వానంగా మారింది. రహదారి మొత్తం గుంతలమయంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవే నుంచి ఈ రహదారి మీదుగా కొర్లకుంట, గొల్లపల్లి, ఓబులాపురం గ్రామాల ప్రజలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, అత్యవసర వైద్యం అవసరమైన రోగులను ఆసుపత్రులకు తరలించే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎన్నిసార్లు చెప్పినా.. పట్టించుకునే నాథుడే లేరా..?

రహదారి పరిస్థితిని అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ రహదారిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. నాయకులు పట్టించుకోవడం లేదంటూ ఆరోపణలుస్థానిక అధికార పార్టీ నాయకులు, మండల స్థాయి నాయకులు గ్రామాల ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని కొందరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రహదారి పనులకు సంబంధించి కాంట్రాక్టు వ్యవహారాల్లో కొందరు రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటున్నారనే ప్రచారం గ్రామాల్లో జరుగుతోందని వారు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత నాయకుల వివరణ తెలియాల్సి ఉంది. శాశ్వత పరిష్కారం చూపాలి. రహదారి దుస్థితిపై అధికారులు ఇకనైనా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, సంబంధిత శాఖల ద్వారా వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే నూతన రహదారి నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. “మా గ్రామాల ఓట్లు అవసరం లేదా..? మేము కూడా ప్రజలమే కదా?” అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారి దుస్థితి కారణంగా భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం జరిగినా బాధ్యత ఎవరిదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

# రాష్ట్ర నీటి అవసరాలు తీరకముందే తెలంగాణకు తరలింపెందుకు...?

**- ఏపీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోంది...?**

**- ప్రభుత్వాన్ని నిలదీసిన...మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి...!**




**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్న సమయంలో శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు తెలంగాణ ప్రభుత్వం నీటిని తరలిస్తుంటే ఏపీ ప్రభుత్వం ఎందుకు అడ్డు కోలేక పోతోందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వై. విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న నీటి సమస్యపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర సమావేశం నిర్వహించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విడపనకల్లు మండల పరిధిలో హెచ్ఎల్‌సీ మెయిన్ కెనాల్ ద్వారా నీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు ఆలోచిస్తుంది ప్రభుత్వం ఆలస్యంగా హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు అప్పటికే ఇతర పంటలు సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం పంటలు ఎండిపోతున్నందున తక్షణమే నీరు విడుదల చేయాలని కోరారు. పీఏబీఆర్ డ్యామ్ సామర్థ్యం, జిల్లాకు అవసరమైన తాగునీటి పరిమాణం, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల సామర్థ్యం, తుంగభద్ర నుంచి వచ్చే నీటిలో తాగునీటికి, ఆరుతడి పంటలకు కేటాయించే నీటి వివరాలను ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. నీటి సమస్యపై ఇప్పటివరకు ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలమట్టాలు పడిపోతుండటంతో బోర్లపై ఆధారపడిన రైతులు, ఉద్యాన పంటల సాగుదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇదే విధంగా నీటిని తరలిస్తే భవిష్యత్తులో హంద్రీ--నీవాకు కూడా నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జిల్లాలోని వ్యవసాయ సంఘాలు, మేధావులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సమగ్ర నీటి లెక్కలు, భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రెండు పంటలు సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదని, రైతులు ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచించారు. కొర్రలు, జొన్నలు, సద్దలు వంటి పంటల విత్తనాలను సబ్సిడీపై ఎంతమంది రైతులకు పంపిణీ చేశారో ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. రైతులకు సబ్సిడీతో పాటు పంట నష్టపరిహారం కూడా అందించాలని డిమాండ్ చేశారు. రైతులను భయపెట్టడం, నిర్బంధించడం, అరెస్టులు చేయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించిన విశ్వేశ్వరరెడ్డి.. నీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రీజినల్ అధికార ప్రతినిధి కేవీ రమణ ఇతర నాయకులు పాల్గొన్నారు

# చికెన్ మటన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

**- పరిశుభ్రత లేకుంటే చర్యలు తప్పవు : ఈవో శివమూర్తి**

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో చికెన్ మటన్ దుకాణాలను నిర్వహిస్తున్న యజమానులకు పరిశుభ్రతపై గ్రామపంచాయతీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చికెన్, మటన్ దుకాణాల్లో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే 5,000 నుండి 25 వేలు వరకు జరిమానా కట్టాల్సి వస్తుందని, గ్రామపంచాయతీ పరిధిలోగల చికెన్, మటన్ దుకాణ దారులు తప్పనిసరిగా పరిశుభ్రత, నియమ నిబంధనలు పాటించాలని పంచాయతీ కార్యదర్శి (ఈఓ) శివమూర్తి, శానిటరీ ఇన్స్పెక్టర్ సురేష్ సర్క్యులర్ నోటీసులు యజమానులకు అందించారు. . దుకాణాల వద్ద మాంసంపై ఈగలు, ఇతర కీటకాలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అద్దాలఫ్రేమ్, జాలరి లాంటి పరికరములను వాడాలని,వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయ కుండా డస్బిన్లలో వేయాలన్నారు. దుకాణదారులకు చికెన్ వ్యర్థాలను రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో వేయడం వల్ల దుర్వాసనతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



వినియోగదారులకు చికెన్ మటన్ సరైన తూకాలతో ఇవ్వాలని, వాటిని ప్లాస్టిక్ కవర్లలో వేసి విక్రయించకూడదని పంచాయతీ వారు సూచించిన డంపింగ్ యార్డు స్థలంలోనే వ్యర్థాలను వేయాలని స్పష్టంచేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994లోని సెక్షన్ 111, 268 ప్రకారం రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని మరొకసారి హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దుకాణదారులు నిబంధనలు పాటించి పామిడి పట్టణాన్ని పరిశుభ్రతను పాటించాలని, దుకాణంలో ప్లాస్టిక్ కవర్లు కనిపించకూడదని, దుకానం పరిసర ప్రాంతం అంతయు తేమ బురద మురికి నీరు ఉండకూడదని బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఈఓ శివమూర్తి, శానిటరీ ఇన్స్పెక్టర్ సురేష్, గ్రామ పంచాయతీ శాఖ వారు యజమానులకు హుక్కుమ్ జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శివమూర్తి శానిటరీ సురేష్, పంచాయతీ కార్మిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరుగు పోటీలో విజేతలకు మెడల్స్‌తో సత్కారం





**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో తలవాల కట్ట ఎదుట గల శ్రీసరస్వతి విద్యా మందిరం నిట్టూరు నిలయం ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలలోని ముగ్గురు విద్యార్థులు శ్రీసరస్వతీ విద్యాపీఠం ప్రతిసంవత్సరం నిర్వహించే ఖేలఖుద్ ఆటలపోటీలలో జిల్లాస్థాయిలో దిలీప్ కుమార్, రితిక్, శ్రీముఖి 200 మీటర్ల పరుగు పోటీలో ఈముగ్గురు ప్రథమ స్థానంలో గెలుపొందారు.తిరిగి రాయలసీమ జోనల్ 400 మీటర్ల పరుగు పోటీలలో అదే ముగ్గురు విద్యార్థులు పాల్గొని అందులో కూడా ప్రథమ స్థానం సంపాదించారు. వీరిని పాఠశాల యాజమాన్యం తరపున ఉపాధ్యక్షులు బొల్లు. శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి బసవరాజు, ప్రధానోపాధ్యాయులు తులసిబాయి మెడల్స్, మెమెంటో బహుకరించి ప్రశంశించారు. ఈ కార్యక్రమంలో మారెన్న,లలిత, ఉపాధ్యాయబృందం,విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్థానిక మేధావులు, విద్యావంతులు ప్రజలు వారి ప్రతిభకు ఆనందిస్తూ తల్లిదండ్రులను,పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తున్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం...!

**- కల్యాణోత్సవానికి పోటెత్తిన భక్తజనం...**

**- భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు**



**ఉరవకొండ రూరల్ - సూర్య వాస్తవం :** విడపనకల్లు మండలం ఉండబండలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి పలువురు దాతలు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా, కమనీయంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## బైక్ కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం ఎన్టీపీసీ సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.బైక్ అదుపు తప్పి కింది పడింది.ప్రమాదంలో రాజశేఖర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన అంబులెన్స్ లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన స్థానికులు.తెలంగాణ రాష్ట్రం ఐజా మండలానికి చెందిన రాజశేఖర్ పని మీద గుత్తికి వచ్చాడు.బైకుపై తిరిగి వెళు న్న సమయంలో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి కింద పడిం ది.ప్రమాదంలో గాయ పడిన రాజశే ఖర్ ను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్న యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం ధర్మాపురం గ్రామ ఫీ ల్డ్ అసిస్టెంట్ రాయుడు ప్రత్యేక ఆ హ్వానం మేరకు కేశఖండన కార్యక్ర మంలో పాల్గొని రాయుడు ఆతిథ్యా న్ని స్వీకరించిన గుంతకల్లు నియోజ కవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుత్తి, పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఈసందర్భంగా రాయుడు గుమ్మనూరు ఈశ్వర్‌కి శాలువా కప్పి పూలమాలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం గు మ్మనూరు ఈశ్వర్ గ్రామస్థులను కూటమి నాయకులను ఆత్మీ యంగా పలకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ మరి యు మండల కూటమి నాయకులు మరియు కార్యకర్తలు మరియు ధ ర్మపురం గ్రామ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డీఎస్సీపై చర్చకు ప్రభుత్వం సిద్ధం....!

**- వైసీపీ పదేపదే నినాదాలు చేయడం సరికాదన్న... ఆర్థికమంత్రి పయ్యావుల**

**- ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని మీరు.. 14 డీఎస్సీలు ఇచ్చిన మమ్మల్ని ప్రశ్నిస్తారా...?**

**- వైసీపీ ఎమ్మెల్సీల తీరుపై పయ్యావుల కేశవ్ ఆగ్రహం...**



**ఉరవకొండ టౌన్- సూర్య వాస్తవం :** శాసనమండలిలో డీఎస్సీ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు పదేపదే నినాదాలు చేయడం సరికాదని ఆర్థిక, శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో రైతాంగం సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రజలకు తాగునీరు, సాగునీటి సమస్యలపై చర్చించకుండా కేవలం డీఎస్సీ అంశంపైనే చర్చ జరపాలని పట్టుబట్టడం సమంజసం కాదన్నారు. ప్రజలు తమకు ప్రభుత్వం నడిపే అవకాశం ఇచ్చారని, సభలో ఏ అంశంపై ఎప్పుడు చర్చించాలో ప్రభుత్వానికి తెలియదా? అని ప్రశ్నించారు. డీఎస్సీపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగానే ఉందని స్పష్టం చేసిన పయ్యావుల.. వైసీపీ ఎమ్మెల్సీలు పదేపదే నినాదాలు చేయడం వల్ల సభా కార్యక్రమాలకు అంతరాయం కలుగుతోందన్నారు. గతంలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని వారు, 14 డీఎస్సీలు ఇచ్చిన తమ ప్రభుత్వాన్ని డీఎస్సీ విషయంలో ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ తాగునీరు, సాగునీరు, వ్యవసాయం వంటి కీలక అంశాలపై కూడా శాసనమండలిలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# తాగునీటితో పాటు సాగునీటికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి...!

**- తుంగభద్ర నీటి విడుదలపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి...**

**- రైతుల సాగునీటి సమస్యలను ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే...**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం తాగునీటితో పాటు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటికి కూడా ప్రాధాన్యత ఇచ్చి తుంగభద్ర నీటిని తగిన స్థాయిలో విడుదల చేయాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. విజయవాడలోని జలవనరుల శాఖ మంత్రి కార్యాలయంలో మంగళ ావారం సాయంత్రం తుంగభద్ర నీటి విడుదలకు సంబంధించి కీలక సమావేశం జరిగింది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు వివిధ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అనంతపురం నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన స్థాయిలో తుంగభద్ర నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.అదే విధంగా అనంతపురం నగర ప్రజల తాగునీటి అవసరాలను కూడా ఎమ్మెల్యే సమావేశంలో ప్రస్తావించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్న నేపథ్యంలో రైతుల సాగునీటి అవసరాలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సమావేశం అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రైతులు, ప్రజల ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాగునీటి అవసరాలతో పాటు రైతుల సాగునీటి అవసరాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని తుంగభద్ర నీటి విడుదలపై తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులకు సాగునీరు అందేలా అవసరమైన చర్యల కోసం ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# లాడ్జిల్లో నేరగాళ్లపై ఏఐ నిఘా.....!

**- నేరగాళ్ళకు లాడ్జిల్లో ఇక నో ఎంట్రీ**

**- సందర్శకుల వివరాల నమోదు తప్పనిసరి:ఎస్పీ జగదీష్**

**- నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలి: జిల్లా ఎస్పీ పి. జగదీష్**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** జిల్లాలో నేరాల నియంత్రణకు లాడ్జిల యాజమాన్యాలు, నిర్వాహకులు, సిబ్బంది పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్, సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యాప్తంగా ఉన్న లాడ్జిల యజమానులు, నిర్వాహకులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రూపొందించిన లిఏఐ ఆధారిత అనంతపురం విజిటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏఐ - ఏవీఎంఎస్)లిను ప్రతి లాడ్జి యాజమాన్యం బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.లాడ్జిల్లో బస చేసే పర్యాటకులు, సందర్శకుల వివరాలను ఎప్పటికప్పుడు ఏఐ - ఏవీఎంఎస్ లో నమోదు చేయాలని ఆదేశించారు. గదులు కేటాయించే ముందు ప్రతి సందర్శకుడి గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. లాడ్జిల ప్రాంగణాలతో పాటు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరస్థుల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు జిల్లాను నేరరహితంగా మార్చేందుకు పోలీసు శాఖకు లాడ్జిల యాజమాన్యాలు సహకరించాలని ఎస్పీ కోరారు. సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు, సీఐలు, ఎస్ఐలు, వివిధ లాడ్జిల యజమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



## విద్యుత్ బిల్ కలెక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- బి నాయబ్ రసూల్, బి ఎన్ నాగసుబ్బయ్య



**తిరుపతి – సూర్య వాస్తవం:** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్ల ఏజెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆగష్టు 17,18 తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం ముందు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు వారి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి నాయబ్ రసూల్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కడప జిల్లా అధ్యక్షుడు బి యన్ నాగసుబ్బయ్య సంయుక్తంగా డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా విద్యుత్ పంపిణీ వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న బి సి ఎ లను ఏకపక్షంగా తొలగించడం, కాంట్రాక్టు పేరుతో శాశ్వతం చేయకుండా వేధించడం తీవ్ర అన్యాయమని వారు అన్నారు. వేల కోట్ల ఆదాయం వస్తున్న డిస్కాం సంస్థలో కనీస ఉద్యోగ భద్రత కూడా లేకుండా బి సి ఎ లను రోడ్డున పడేయడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. బిసిఏల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరిపి, ఉద్యోగ భద్రతతో పాటు జీతభత్యాలు, ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మనతో మనమధ్య పనిచేసిన వారిని తొలగించడాన్ని, కార్మిక ఉద్యోగులు వ్యతిరేకించి పిసిఏలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బి సిఏలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారి పోరాటంలో అండగా ఉంటామని కడప జిల్లా అధ్యక్షుడు బి ఎన్ నాగ సుబ్బయ్య స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థ అభివృద్ధిలో సంవత్సరాలు తరబడి సేవలందించిన, అందిస్తున్న, కాంట్రాక్టు కార్మికులను గాని ఫ్లీజ్ రేట్ వర్కర్లను గాని అన్యాయంగా తొలగించడం కార్మిక చట్టాలకు వ్యతిరేకం కార్మిక వర్గమంతా బిల్ కలెక్టర్లు లకు అండగా నిలబడాలని, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు ఈనెపాటి లెనిన్ బాబు తెలిపారు.

## 21న ఉచిత వైద్య శిబిరం



**నరసరావుపేట – సూర్య వాస్తవం:** ఆంధ్ర హాస్పిటల్స్ మరియు మహేష్ బాబు ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో చిన్నపిల్లల గుండె ఆపరేషన్లకు సంబంధించిన వైద్యశిబిరం పల్నాడు జిల్లా కేంద్రం అయిన నరసరావుపేట పట్టణంలో 21వ తేదిన నిర్వహించుచున్నారు. స్థానిక రామిరెడ్డిపేట లో హీరో కృష్ణ – మహేష్ బాబు అభిమాన సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ లింగస్వామి పాల్గొని అవసరమైన వారికి గుండె పరీక్షలు నిర్వహిస్తారు. కేవలం ఈ ఒక్కసారి మాత్రమే కాకుండా ప్రతినెల మూడో శుక్రవారం రోజున స్థానిక పల్నాడు రోడ్ లో ఉన్న నాగసరపు రామారావు కాంప్లెక్స్ వెనక సందులో ఉన్న శ్రీ.త్రికోటేశ్వర స్కాన్ సెంటర్ నందు వైద్య శిబిరం నిర్వహిస్తారు. కావున అప్పుడే పుట్టిన పిల్లల నుండి 15 సంవత్సరాల లోపు పిల్లల వరకు గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారు సంప్ర దించవలసినదిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా – టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ- మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఫారూఖ్ బాబు మరియు అభిమాన సంఘం సభ్యులు నబీబాజీ, చిన్నికృష్ణ, మౌలాలి, బుచ్చిబాబు, మన్నేపల్లి శ్రీను, బాజీ , సుభాని తదితరులు పాల్గొన్నారు.

## గండి శ్రీ వీరాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

**చక్రాయపేట – సూర్య వాస్తవం:** వైఎస్సార్ కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.యుగంధర్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి శ్రీ వీరాం జనేయ స్వామి వారిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయానికి విచ్చేసిన జిల్లా వైద్యాధికారి కి జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాజా మౌనిద్దీన్ ఆధ్వర్యంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, గంగశేఖర్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.యుగంధర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఆరోగ్య శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, బాధ్యతాయుతంగా పనిచేసి రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అరిపుల్లా, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, డీపీఎంవో డాక్టర్ తహా, సబ్ యూనిట్ అధికారులు ప్రసాద్, రాఘవులు మరియు ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జమ్మలమడుగు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం

## - రోటరీ క్లబ్ ప్రసిడెంట్‌గా మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి, సెక్రటరీగా సి.రంగేశ్వర రెడ్డి




**జమ్మలమడుగు – సూర్య వాస్తవం:** పట్టణంలోని యస్ పి డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ జమ్మలమడుగు నూతన కార్యవర్గ సభ్యుల చేత ఐపి ఎజి కె.వి.మురళి ధర రెడ్డి మరియు అసిస్టెంట్ గవర్నర్ టీ.సుధీర్ కుమార్ రెడ్డి లు ప్రమా ణం చేయించారు. ముందుగా 2025 – 2026 సంవత్సరం లో రోటరీ క్లబ్ జమ్మలమడుగు ద్వారా నిర్వహించిన అనేక సామాజిక సేవా కార్యక్రమాలను రోటరీ సెక్రటరీ ఈ.సంజీవ రాయుడు చదివి వినిపించారు. తరవాత ఈ నూతన కార్యవర్గ సభ్యులను పాస్ట్ పిడిజి సాధు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నూతన ప్రసిడెంట్ మరియు సెక్రటరీ అలాగే సభ్యుల చేత రోటరీ నియమ నిబంధనలు అనుసరించి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా పిడిజి గోపాలకృష్ణ మాట్లాడుతూ రోటరీ సంస్థ అనేది సేవా దృక్పథంతో సమాజానికి సేవ చేయడమే ముఖ్య ఉదేశ్యం అన్నారు. కావున రాబోయే కాలంలో జమ్మలమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అన్ని రకాల సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ కె.రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరు సేవ చేయుటకు ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు. ఎవరైనా ఆకస్మాత్తుగా మరణించిన సమయంలో వారి అవయవాలు ధానం చేయుటకు ముందుకు వచ్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలి అన్నారు. తదుపరి రోటరీ క్లబ్ జమ్మల మడుగు ప్రసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రోటరీ అంటే నిస్వార్థంగా సేవ చేయడం అన్నారు. మున్ముందు రోటరీ పెద్దలు మరియు సభ్యుల సహకారంతో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేయుటకు అందరి సహకారం అవసరం అన్నారు. ప్రతి మనిషి తల్లి గర్భం నుండి పుట్టినప్పుడు ఊపిరి ఉంటుంది కానీ పేరు ఉండదు అలాగే చనిపోయిన తరవాత పేరు ఉంటుంది కానీ ఊపిరి ఉండదు. ఈ మధ్య జీవించి ఉన్న కాలములో ప్రతి మనిషి మానవతా విలువలు కలిగి సమాజానికి సేవ చేసి, అందరి మన్ననలు పొంది తమ పేరును చిరస్థాయిగా నిలుపుకునేలా సేవా దృక్పథంతో మెలగాలి అన్నారు. రోటరీ సెక్రటరీ రంగేశ్వర రెడ్డి మాట్లాడుతూ రోటరీ సభ్యుల అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తామని తెలిపారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్లు మురళి ధర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సహకారంతో రోటరీ కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. సేవా భావంతో సామాజిక సేవ చేయడమే రోటరీ అంతిమ లక్ష్యం అన్నారు. తదుపరి ఎజి.సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నూతన బాద్యతలు చేపట్టిన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేయుటకు అందరి సహకారాలు అవసరం అన్నారు. తదుపరి ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ పాస్ట్ ప్రసిడెంట్ గజ్జెల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేయుటకు రోటరీ అనే సంస్థ మంచి ప్లాట్ పామ్ అన్నారు. రోటరీ సంస్థ అనేది ప్రపంచ వ్యాప్తంగా 220 దేశాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు అనేక రకాలుగా చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ కుందా భాస్కర్ మాట్లాడుతూ రోటరీ అనే సంస్థ లో ప్రతి ఒక్కరు సభ్యత్వం కలిగి ఉండాలి అన్నారు.

అనంతరం నూతన బాధ్యతలు చేపట్టిన ప్రసిడెంట్ సెక్రటరీ లను పుష్ప గుచ్ఛాలు ఇచ్చి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ పెద్దలు, సభ్యులు ,బంధు మిత్రులు పాల్గొన్నారు.

# మాదిగలకు ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలి

## - మాదిగ జెఏసి మహాధర్నా



**కడప – సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ మాదిగల జెఏసి ఏర్పాటు చేసి కడప కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. కడప నగరంలోని బాలాజీ నగర్ బుగ్గవంక దగ్గర ఉన్న చెమ్ముమియపేట రెవెన్యూ గ్రామ పొలం సర్వే నెంబర్ 601 లో 5-70 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన నిర్మాణం మరియు మాదిగలకు ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని ధర్నా కోరారు. కడప నగరంలో బాలాజీ నగర్ దగ్గర ఉన్న బుగ్గవంక పరిసర ప్రాంతాంలో చెమ్ముమియపేట రెవెన్యూ గ్రామ పొలం సర్వే 600 లో దాదాపు 50 సెంట్లు భూమి లో అరుంధతీ సేవ సంఘం భవనము ఉండేదని 1992 సంవత్సరంలో అరుంధతీ సేవ సంఘం అధ్వర్యంలో చర్మాల సేకరణ చేసి వాటిని అమ్మి మాదిగలు జీవనం చేస్తూ ఉండేవారు. అయితే 2001సం,, లో వచ్చిన వరదల వల్లన బుగ్గవంక కు అతి సమీపంలో ఉన్న అరుంధతీ సేవ సంఘం భవనము కూలి కొట్టుకొని పోయినది. అయితే అప్పటి కలెక్టర్ జయష్ రంజన ని ప్రక్కనే ఉన్న సర్వే నెంబర్ 601లో ఉన్న 5-70 సెంట్లు భూమిని మేము ఆ భూమిని మాదిగల కు ఇంటి స్థలాలు కు కేటాయించామని కోరడం జరిగింది. అయితే బాలాజీ నగర్ కు చెందినఆ ప్రాంతంలో ఉన్న సబ్ ఇన్స్పెక్టర్ సాధక్ వల్లి కుమారుడు లియాఖత్ అనే ఒక ముస్లిం వ్యక్తి బోగస్ డి- ఫారం పట్టా సృష్టించి హై కోర్టు లో రిట్ పిటీషన్ దాఖలు చేసి ఈ భూమి మాది అని ఈ రిట్ పిటీషన్ ద్వారా ౠచీో 1358/86 స్టే తెచ్చుకోన్నారు. అయితే 1986 సం,, లో అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ క్రిష్ణ రావు 320/512(2)/86 ద్వారా ఈ భూమి లియాఖత్ కు ఇవ్వడానికి విలులేదు అని ఆయన రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ రిపోర్ట్ ప్రకారం వీకర్ సెక్షన్ ప్రజలకు ఇంటి స్థలాల కొరకు ఇవ్వచ్చుని తెలిపారు. అప్పటిలో అదే సర్వే నెంబర్ లో కొంతమంది మాదిగలకు అప్పటి మండల రెవెన్యూ అధికారులు కొంతమంది మాదిగలకు ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేసినారు. కొంతమంది అదే స్థలం లో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉన్నారు. కొంతమంది ఆ స్థలంలోనికి రానివ్వకుండా ఆ భూమి హై కోర్టు లో లియాఖత్ వేసిన స్టే ఆర్డర్ చూపించేవారు. అయితే గౌరవ హై కోర్టు లో లియాఖత్ చేసిన అని పిటిషన్లు 12/06/2000 తేదీన కోటివేయడం జరిగింది. లియాఖత్ గారు ఆ భూమి వదలకుండా W P N O 10368/1987; W P N O18930/1988; W P N O16974/1998; W P N O3755/1999; W P N O 14643/2011; W P N O 7491/2014; W P N O821/2014 రిట్ పిటీషన్ దాఖలు ద్వారా అప్పీలు చేయడం జరిగింది. అయితే 09/01/2014 తేదీన అని రిట్ పిటీషన్లు కోటివేయడం జరిగింది. లియాఖత్ ఇన్ని సంవత్సరాలు అటు ప్రభుత్వ అధికారులను మోసం చేస్తూ మాదిగ చర్మకారులైన మమ్ములను ఆ స్థలంలోనికి రానివ్వకుండా చేశారు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు మాదిగలమైన మేము ఆ ప్రాంతంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవనం అలాగే మాదిగలకు ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయమని 2001 సం,, నుండి దాదాపు 25 సం,, ఎన్నో పోరాటాలు చేయడం జరిగింది. ఆ స్థలాన్ని మాదిగల కు కేటాయించాలని గౌరవ జిల్లా కలెక్టర్ గారిని కోరుచున్నాము. అయితే ఈ మధ్య కాలంలో కొందరు కొత్త చర్మకారుల కో ఆప్రేరేటవ్ సొసైటీ ఏర్పాటు చేసి ఆ స్థలాన్ని సొసైటీ ఇవ్వాలని ఆ స్థలాన్ని మాదిగల కు చెందకుండా స్వాహా చేయాలని ప్రయత్నిస్తున్నారు. సుదీర్ఘ పోరాటాలు చేస్తున్న మాదిగల కు ఆ స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. చెమ్ముమియపేట రెవెన్యూ గ్రామ పొలం సర్వే నెంబర్ 601 లో ఉన్న ప్రభుత్వ భూమిని మాదిగల కు కేటాయించి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవనం అలాగే మాదిగలకు ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్ ని కోరారు.

# పొలం కలిగి ఉన్న ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని రైతు విశిష్ట సంఖ్య (ఐడి)ని పొందాలి

## - మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి



**ముద్దనూరు– సూర్య వాస్తవం:** వ్యవసాయ శాఖ ద్వారా అమలుచేసే ప్రతి పథకం లబ్ధిపొందాలి అంటే తప్పనిసరిగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ముద్దనూరు మండలంలోని బడుగువారిపల్లె మరియు అరవేటిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ పక్రియ ను పూర్తి చేసుకొని రైతు విశిష్ట సంఖ్య ఐడి ని పొందాలి అన్నారు. రైతు విశిష్ట సంఖ్య లేకపోతే వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ఏ పథకం లబ్ధిపొందలేరు అన్నారు. కావున ప్రతి రైతు తప్పని సరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య ను పొందాలి అన్నారు. రైతులు క్యూ ఆర్ కోడ్ ద్వారా కూడా మొబైల్ లో స్కాన్ చేసి స్వతహాగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అన్నారు. లేదా ఓటిపి ద్వారా కూడా సిబ్బందిని సంప్రదించి రైతులు ఐడి పొందాలి అన్నారు. ఎవరికి అయిన రైతులు ఓటిపి ద్వారా కాకపోతే ముఖ యాప్ ద్వారా కూడా చేసుకోవాలి అన్నారు. మండలంలో ఇప్పటివరకు 7389 మంది రైతులకు గాను 6359 మంది రైతులకు రైతు రిజిస్ట్రేషన్ పక్రియ పూర్తి చేసి విశిష్ట సంఖ్య ఐడి లను ఇప్పించడం జరిగింది. ఇంకా మండలం లో ఆయా గ్రామాల్లో 1039 మంది రైతులు పెండింగ్‌లో ఉన్నారు అటువంటి రైతులు అందరిని గుర్తించి రైతు సేవా కేంద్ర సిబ్బంది రైతు విశిష్ట సంఖ్య పూర్తి చేసే విధముగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పంట నమోదు ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. పంట నమోదు కాకపోతే ఏ పథకం వర్తించదు అన్నారు. రైతులకు యూరియా,డి ఎపి ఎరువులు కూడా పంట నమోదు ,మరియు పంట సాగు వివరాల ఆధారంగా నే ఎరువులను రైతులకు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది కల్పన,పకృతి వ్యవసాయ సిబ్బంది ముని భూపాలుడు, రమణయ్య, రామాంజనేయులు, పుష్ప, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



## రామ్ పోతినేని డెడికేషన్‌కు హాట్సాఫ్..
# ఆపకుండా 24 గంటల పాటు షూటింగ్

హీరో రామ్ పోతినేని తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాపో23' కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు హీరోగానూ నటిస్తున్న రామ్.. పుదుచ్చేరి శివార్లలో ఏకంగా 24 గంటల పాటు నిర్విరామంగా షూటింగ్‌లో పాల్గొన్నట్లు సినీ వర్గాల సమాచారం. నటుడిగా తన పాత్రను పూర్తి చేయడంతో పాటు దర్శకుడిగా సినిమా చిత్రీకరణను పర్యవేక్షిస్తూ రామ్ బిజీగా ఉన్నారు. ఈ విషయంలో ఆయన చూపిస్తున్న అంకితభావంపై చిత్ర బృందం ప్రశంసలు కురిపిస్తోంది. 'రాపో23' కోసం పుదుచ్చేరిలో భారీ స్థాయిలో ప్రత్యేక సెట్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు తొమ్మిది రోజుల పాటు అక్కడ షూటింగ్ కొనసాగింది. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్న సమయంలో అనూహ్యంగా వర్షాలు రావడంతో చిత్రీకరణకు అంతరాయం ఏర్పడింది. దీంతో షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసి చిత్ర బృందం హైదరాబాద్‌కు తిరిగి వచ్చింది. మిగిలిన సన్నివేశాలను పూర్తి చేసేందుకు త్వరలోనే మరోసారి పుదుచ్చేరికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా నేతృత్వంలో ఓ ప్రత్యేక పాటను తెరకెక్కించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. అలాగే 'కేజీఎఫ్: చాప్టర్ 1', 'కాంతారా' వంటి చిత్రాలకు పనిచేసిన స్టంట్ కొరియోగ్రాఫర్ విక్రమ్ మోర్ రూపొందిస్తున్న పలు హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను కూడా చిత్రీకరించనున్నారు. దీంతో పుదుచ్చేరి షెడ్యూల్ సినిమాకు కీలకంగా మారనుంది. రామ్ పోతినేని స్వయంగా రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని 'రాపో సినిమాటిక్స్' బ్యానర్‌పై కృష్ణ పోతినేని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. 'రాపో23'ను సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. నయా-నోయర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రామ్ 'వీర' అనే పాత్రలో కనిపించనున్నారు. నేషనల్ అవార్డు గ్రహీత తిరునావుక్కరసు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## 'ఇరుముడి'కి సెన్సార్ పూర్తి..
# అనుకున్న తేదీకే రవితేజ సినిమా

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) U/A సర్టిఫికేట్ జారీ చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించింది. దీంతో సినిమా విడుదలకు అన్ని అడ్డంకులు తొలగిపోయినట్లయింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. "'ఇరుముడి' చిత్రానికి U/A సర్టిఫికేట్ వచ్చింది. ఈ ఎమోషనల్ ఫ్యామిలీ థ్రిల్లర్ కోసం టిక్కెట్లు బుక్ చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి. ఆగస్ట్ 21న సినిమా థియేటర్లలో విడుదల" అని పోస్ట్ చేసింది. ఈ ప్రకటనతో సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా వస్తున్న వదంతులకు చిత్రబృందం తెరదించింది. ముందుగా ప్రకటించినట్లే ఆగస్ట్ 21న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇది రవితేజకు 77వ చిత్రం కావడం విశేషం. అయ్యప్ప భక్తులు పవిత్రంగా భావించే 'ఇరుముడి' అనే టైటిల్‌తో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. కూతురితో ఎంతో ప్రేమగా




ఉండే తండ్రి పాత్రలో రవితేజ కనిపించనున్నారు. కొన్ని అనుకోని సంఘటనల వల్ల ఆయన జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది, మద్యానికి బానిసైన వ్యక్తి తన కూతురి కోసం అయ్యప్ప మాల ధరించి ఎలా మారాడనేది కథాంశంగా తెలుస్తోంది. గతంలో విడుదలైన గ్లింప్స్ వీడియో సినిమాపై ఆసక్తిని పెంచింది.

## నిధి అగర్వాల్ కొత్త సినిమా..
# ఈసారి ఏకంగా మైథలాజికల్ థ్రిల్లర్!

హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు



తెలుస్తోంది. వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది. సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు.



## గాలే టెస్టుపై భారత్ పట్టు..
# విజయం దిశగా టీమిండియా

గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై భారత్ పూర్తి పట్టు సాధించింది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి కష్టాల్లో పడింది. విజయానికి టీమిండియా కేవలం 6 వికెట్ల దూరంలో నిలవగా, లంక గెలవాలంటే చివరి రోజు ఇంకా 288 పరుగులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితిలో ఉంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో నాలుగో రోజు ఆటలో టీమిండియా సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. భారీ లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో బౌలింగ్ ప్రారంభించిన భారత్‌కు పేసర్ మహమ్మద్ సిరాజ్, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుతమైన శుభారంభం అందించారు. సిరాజ్ తన బౌన్సర్‌తో నిషాన్ మదుష్క (6)ను ఔట్ చేసి తొలి వికెట్ అందించగా, ఆ తర్వాతి ఓవర్లోనే మానవ్ సుతార్.. దినేష్ చండీమాల్ స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన పసిందు సూరియబండార (0)ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కొద్దిసేపటికే ప్రసిద్ధ్ కృష్ణ.. కమిందు మెండిస్ (2)ను కీపర్ క్యాచ్‌గా ఔట్ చేయడంతో శ్రీలంక 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో లహిరు ఉదార (16), కెప్టెన్ ధనంజయ డిసిల్వా కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. అయితే, మరోసారి బౌలింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ ఈ జోడీని విడదీసి తన రెండో వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సోనాల్ దినుష (25




నాటౌట్)తో కలిసి ధనంజయ డిసిల్వా (31 నాటౌట్) పోరాడటంతో నాలుగో రోజు మరో వికెట్ పడకుండా లంక ముగించగలిగింది. వీరిద్దరూ అజేయంగా ఐదో వికెట్‌కు 37 పరుగులు జోడించారు. వెలుతురు మందగించడంతో అంపైర్లు ముందుగానే ఆటను నిలిపివేశారు. అంతకుముందు, నాలుగో రోజు ఆటను కొనసాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులకు ఆలౌట్ అయింది. రిషబ్ పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 69 బంతుల్లో 66 పరుగులు చేశాడు. దేవదత్ పడిక్కల్ (44), కేఎల్ రాహుల్ (35) కూడా రాణించి జట్టుకు విలువైన పరుగులు అందించారు. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి భారత్.. శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. లంక బౌలర్లలో అసింత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు పడగొట్టారు.




## పుల్లెల గోపీచంద్ కుమార్తె
# గాయత్రికి అర్జున అవార్డు..

కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. అయితే, ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమైనాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన జనసేన మండల అధ్యక్షులు ఆవుల రమణ





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట నియోజకవర్గం సూళ్లూరుపేట జనసేన మండల అధ్యక్షులు ఆవుల రమణ ఏపీసిసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివిఎస్ కమలాకర రావు ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఆవుల రమణ ను కాంగ్రెస్ పార్టీ జివివిఎస్ కమలాకర్ రావు,తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు,కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్ కుమార్ ఆవుల రమణ ను కాంగ్రెస్ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. భారతదేశంలో 2029 సార్వత్రిక ఎన్నికలలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాహుల్ ప్రధాని అవ్వడం ఖాయమని తెలిపారు.

## హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన




**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు దిశా విభాగం సహకారంతో మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్-సి.సి-పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సును దొరవారిసత్రం లోని"యం.జె.పి.బి.సి.డబ్ల్యు జూనియర్ కాలేజ్"నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు మేనేజర్ అయిన కె.బాలాజి మాట్లాడుతూ,హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు,ఎలా వ్యాపించదు లక్షణాలు, అవి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి,వ్యాధిగ్రస్తులు పట్ల వివక్షత,చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గురించి,డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ ఉపయోగం గురించి,హెచ్ఐవి/ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏ.ఆర్.టి మందులు,ఎ.పి.శాక్స్ యాప్, క్యు.ఆర్ కోడ్,సెల్ఫ్ రిస్క్ అసెస్ మెంట్,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలుపుతూ,మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియ జేయమని చెప్పడం జరిగింది. అవగాహన కలిగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ యం.తిరుపతయ్య ,వైస్ ప్రిన్సిపాల్ యం. సుజీవనరావు,లెక్చరర్ పి.కస్తూరి బాబు, ఓ.ఆర్.డబ్ల్యూ లు కె.విజయశ్రీ, ఆర్.భువనేశ్వరి, ఎ.యన్.యమ్ జి.శ్రీలత,పి.ఇ లు మరియు 90 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది.తదుపరి క్రిష్ణాపురం ఏరియా లో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కలిగించడం కోసం ర్యాలీ మరియు మీటింగ్ నిర్వహించడం జరిగింది.ఈ ర్యాలీ లో 100 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.వీరిలో 18 మంది ప్రజలుకు నవజీవన్ సంస్థ ఎ.యన్.యమ్ జి.శ్రీలత ద్వారా హెచ్ఐవి పరీక్షలు చేయించి వారి స్థితిని వారికి తెలియజేశారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి పంచాయతీలో కమలం వికసించేలా పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషిచేయాలి

### - మంత్రి సత్య కుమార్"

దొరవారిసత్రం – సూర్య వాస్తవం : ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని ప్రతి గ్రామాన్నికి విస్తరించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి పంచాయతీలో కమలం విశ్వసించేలా పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.ఆయన మంగళవారం విశాఖపట్నంలో బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ నాయకత్వంలో నిర్వహించిన విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షులుగా శ్రీ నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టడం పార్టీకి గర్వకారణమని పేర్కొంటూ,ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని ప్రతి గ్రామానికి విస్తరించి,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో కమలం వికసించేలా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక కార్యాచరణతో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు,కూటమి ధర్మాన్ని పాటిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించి బీజేపీని రాష్ట్రంలో మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దాలని సూచించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్--2047 లక్ష్యంగా దేశం వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొంటూ,ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి రాష్ట్ర ప్రగతిలో బీజేపీ శ్రేణులు మరింత కీలక పాత్ర పోషించాలని కోరారు.





# 2029లో భారత ప్రధాని రాహుల్ గాంధీనే

### - ఎన్డీఏ ప్రభుత్వంలో పేపరు లీకులు,రామ మందిరం కుంభకోణాలు తప్ప దేశంలో అభివృద్ధి శూన్యం
### - ఏపీసిసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివిఎస్ కమలాకర రావు వెల్లడి

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** భారతదేశంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన పిమ్మట దేశంలో పేపర్ లీకులు, రామ మందిరం కుంభకోణాలు అణగారిన వర్గాలను అణచవేతే తప్ప13 సంవత్సరాలలో భారత దేశంలో అభివృద్ధి శూన్యమని ఏపీ సి సి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివిఎస్ కమలాకర్ రావు తెలిపారు.ఈ సందర్భంగా స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర పర్యటన లో భాగంగా మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఆర్ అండ్ బి బంగ్లా నుండీ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గల అంబేద్కర్ విగ్రహానికి, కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు



లర్పించారు.చైర్మన్ జివివిఎస్ కమలాకరరావు, జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు మాట్లాడుతూ అటు భారతదేశంలో ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గాని అభివృద్ధి జరగలేదని ఇరు పార్టీల నాయకులు దోచుకో దాచుకో అనే నినాదంతో పనిచేస్తున్నారని,ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద తిరగబడ్డ విద్యార్థి లోకం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా తిరగబడతారని తెలిపారు.విద్యార్థి లోకానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేపించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు పాల్గొన్నారు.

# యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి

### - "ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్"

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** యువత కేవలం ఉద్యోగాలు కోరుకునే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం.విశాఖపట్నంలో బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సమక్షంలో నిర్వహించిన యువ సంవాద్ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత ఆలోచనలు,ఆకాంక్షలు,దేశ భవిష్యత్తుపై వారి దృక్పథాన్ని తెలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభించిందని పేర్కొన్నారు. స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, ఏఐ,విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి ఆధునిక రంగాల్లో



యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలపై నితిన్ నబిన్ ప్రసంగం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని తెలిపారు. యువత శక్తికి సరైన దిశ,అవకాశాలు లభిస్తే 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో వారు కీలక భాగస్వాములు అవుతారని పేర్కొంటూ, యువత కేవలం ఉద్యోగాలు కోరుకునేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. సృజనాత్మకత, ఆవిష్కరణలు, సానుకూల ఆలోచనలతో దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ, యువ సంవాద్ కార్యక్రమం యువతలో నూతన ఉత్సాహాన్ని నింపిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.



# "ఉన్నతి"పథకం నిధులు దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

### - ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** రాష్ట్ర మహిళా అభివృద్ధి సాధించడం కోసం అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులు ఏర్పాటు చేసి అమలు చేసిన ఉన్నతి పథకం నిధులు దుర్వినియోగంపై విచారణ జరిపించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు.అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరగడం కోసం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం భాగంగా ఏర్పాటుచేసిన సెర్ప్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.సమాజంలో వెనకబడిన ఎస్సీ ఎస్టీ మహిళలకు ఆర్థిక స్థిరత్వం ఏర్పాటు చేయడం కోసం ఒక్కో జిల్లాకు 10 కోట్ల చొప్పున 130 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి"ఉన్నతి" పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఉన్నతి పథకంలో ఎస్సీ ఎస్టీ మహిళలకు లక్ష నుండి 3 లక్షల రూపాయలు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం



జరుగుతుందన్నారు.ఉన్నతి పథకంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి ఎం జె వై పథకం ద్వారా 40 శాతం రాయితీ ఇచ్చే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆయా జిల్లాల్లో వడ్డీ లేని ఈ రుణాల ద్వారా ఎస్సీ ఎస్టీ మహిళలు కూరగాయలు,పుట్టగొడుగులు,ఇతర చిరు వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించారన్నారు.తిరిగి రుణాలు 36 నెలల్లో చెల్లించే విధంగా నిబంధన విధించారని తెలిపారు.ఈ పథకాన్ని అమలు చేయడం కోసం సి ఓ,ఏ పీ డి లను నియమించినట్లు తెలిపారు.ఎస్సీ,ఎస్ టి మహిళలు తాము రుణాలు చెల్లించినట్లు డ్వాక్రా సంఘాలు తెలియజేస్తున్నాయని అన్నారు. ఎస్సీ ఎస్టీ మహిళలు చెల్లించిన రుణాల నగదు ఎక్కడుండాయన్న సందేహం కలుగు తుందన్నారు.ఎంతో మంచి లక్ష్యంతో కేటాయిం చిన నిధులు పక్కదారి పట్టడం బాధాకరం అన్నారు.ఈ పథకంలో ఎంత నిధులు మంజూరయ్యాయి, లబ్ధిదారులకు ఎంత నిధులు అందాయి,ఎంత నిధులు వసూలు అయ్యాయి,మహిళల చెల్లించిన రుణాలకు సంబంధించిన నగదు ఎక్కడున్నాయన్న విషయాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి "ఉన్నతి"పథకం లక్ష్యం నెరవేరేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు.

# ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వైసీపీ 'గుడ్ మార్నింగ్'

పెళ్లకూరు – సూర్య వాస్తవం : ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకునే లక్ష్యంతో రావులపాడు గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో 'గుడ్ మార్నింగ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పలువురు ప్రజలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రిసిల్లా పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి



వారి సమస్యలను తెలుసుకోవడం, వారి అభిప్రాయాలను గౌరవించడం ద్వారా పార్టీ కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువ కావాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మధ్యకు వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకోవడం, వారి సమస్యలపై స్పందించడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలన్న ఆకాంక్షను పలువురు ప్రజలు వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేయాలని పిలుపునిచ్చారు.

రావులపాడులో నిర్వహించిన 'గుడ్ మార్నింగ్' కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు గ్రామ ప్రజల నుంచి స్పందన లభించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )